విఠలేశ్వర.. ఊరు వాగైంది..!

- వర్షాలు, వరదల్లేకున్నా తప్పని ముంపు
- మరోమారు నీట మునిగిన విఠలేశ్వర నగర్
- ఈ ఏడాదిలో ఇది మూడోసారి
- చెరువుకు నీరు మళ్లించే తూములే అసలు సమస్య
- ఈ నెల 15 వరకు తప్పదంటున్న అధికారులు


విఠలేశ్వర నగర్ లో చేరిన నీరు


విఠలేశ్వర్ నగర్‌లో ప్రధాన రహదారిపై ముందుకు కదలని నీరు


ఓ వీధిలో గృహాలను చుట్టిన నాచుతో కూడిన నీరు

భట్టిప్రోలు: వర్షాలు వీడిన భట్టిప్రోలు విఠలేశ్వర నగర్‌ను ముంపు వీడడం లేదు. అసలే లోతట్టు ప్రాంతం దీనికి తోడు కాలనీ పక్కగా వెల్లటూరు సాగునీటి కాల్వ ఉధ్రుతంగా పారుతుండడంతో తూము ద్వారా నీరు కాలనీలోకి చేరుతోంది. దీంతో కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలనీ ఏర్పడి రెండున్నర దశాబ్దాలు అవుతోంది. ఈ ఏడాది ఇప్పటికే 3 సార్లు వర్షాలు ముంపునకు గురికాగా, ప్రస్తుతం సాగునీటి కాల్వ వల్ల నీరు చేరి రహదారులు మునిగిపోతున్నాయి. గృహాలను కూడా నీరు చుట్టుముట్టిందని స్థానికులు వాపోతున్నారు. కాలనీకి సమీపంలోని పంచాయతీ చెరువుకు కాల్వ నుంచి నీటిని పెట్టుకునేందుకు తూములు ఏర్పాటు చేశారు. కాలనీలోకి నీరు చొరబడితే వెల్లటూరులో ఉన్న కాల్వ లాకులు బిగించి నీటిని మళ్లించేవారు. కానీ ఆ కాల్వలో ఉన్న తూములు బిగించకపోవడం వల్ల తూముల ద్వారా సాగు నీరు చేరి కాలనీ ముంపునకు గురవుతోంది. చెరువుకు ఏర్పాటు చేసిన కాల్వ తూములను ఎప్పటికప్పుడు సరిచూసుకోకుండా ఉండడం వల్ల వర్షం లేకపోయిన కాలనీ మునిగిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 200 కుటుంబాలు ఈ కాలనీలో నివశిస్తున్నాయి. నీటి ద్వారా పాములు, పురుగు పుట్రా ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని, పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని కాలనీ ముంచెత్తిన నీటిని బయటకు మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

15 తర్వాతే..

ప్రస్తుతం దిగువకు సాగు నీరు అవసరం ఎంతో ఉంది. ఈ పరిస్థితుల్లో కాల్వలో సాగు నీరు నిలుపదల సాధ్యం కాదు. ఈ నెల 15వ తేదీ తర్వాత కాల్వ నీరు తగ్గించే అవకాశం ఉంది.

–సువర్చల, ఇరిగేషన్ ఏఈ, భట్టిప్రోలు

ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు

కాలనీలో రహదారులు ముంపునకు గురైన విషయం మా దృష్టికి వచ్చింది. ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూఎస్, పరిషత్, పంచాయతీ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

–కోటా శ్రీనివాసరరావు, పంచాయతీ కార్యదర్శి, భట్టిప్రోలు

క్లుప్తంగా

నత్త నడకన రేపల్లె రైల్వే స్టేషన్ అభివృద్ధి

పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి మోహనరావు

రేపల్లె రూరల్: రేపల్లె రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను రైల్వే అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రైల్వే స్టేషన్‌లో పెరుగుతున్న రైలు ప్రయాణికుల అవసరాలను తీర్చే ఉద్దేశంతో గతేడాది అమృత భారత్ స్కీంలో రేపల్లె రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ పనులు నత్త నడకన నడుస్తున్నాయనటంలో ఏ మాత్రం సందేహం లేదన్నారు. రూ.25.5 కోట్ల బడ్జెట్‌తో 2023 ఆగస్టు 6న ప్రధాని మోదీ వర్చువల్ విధానంతో ప్రారంభించిన అభివృద్ధి పనులు 14 నెలలైనా..ఇంకా జరుగుతుండటం విచారకరమన్నారు. ఆధునీకీకరణ పనులతో స్టేషన్‌లో ఇటీవల నిర్మించిన 2వ ప్లాట్ ఫాం, మూడవ రైల్వే లైను నిరుపయోగంగా మారాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పనులను వేగవంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు.

సమారాధన కరపత్రాల ఆవిష్కరణ



భట్టిప్రోలు: భట్టిప్రోలు–అద్దేపల్లి 23వ కార్తిక సమారాధన కరపత్రాల ఆవిష్కరణ ఆదివారం స్థానిక కంచి కామాక్షి సమేత బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగింది. 17న సమారాధన జరుగుతుందని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీనివాసరావు, పామర్తి లింగాచారి(విష్ణుష్) తెలిపారు. ఈ ఆవిష్కరణలో కార్పెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కోడూరు వెంకటేశ్వరరావు, నిర్వాహకులు పామర్తి లింగాచారి, జాలాది పవన్, నూతలపాటి రత్నాకరరావు, కె.చెన్నకేశ్వరరావు, వి.సువర్ణచారి పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తులు పంపిణీ



భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వరద బాధిత కుటుంబాలకు చీరలు, బెడ్‌షీట్లు, లుంగీలు, రగ్గులు పంపిణీ చేశారు. పెదలంక గ్రామానికి చెందిన 340 కుటుంబాలకు వీటిని అందజేశారు. గ్రామ సర్పంచ్ వేములపల్లి శ్రీరంజని, వీరాంజనేయులు, కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్ది బాబు రాజేంద్రప్రసాద్, చందోలు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు సీహెచ్ అగస్టిన్ బాబు, న్యాయవాది దారం సాంబశివరావు, దర్శి భాస్కరరావు, సీహెచ్ సుధాకర్, కె.వీరాంజనేయులు, వి.అశోక్ కుమార్, పి.శేఖర్, బి.సత్యన్నారాయణ పాల్గొన్నారు.

నేత్రాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



కొండపాటూరు(కాకుమాను): మానవ శరీరాల్లో అతి ముఖ్యమైనవి నేత్రాలని అలాంటి నేత్రాలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శంకర కంటి వైద్యశాల వైద్యులు చైతన్య అన్నారు. మండలంలోని కొండపాటూరులో ఆదివారం యార్లగడ్డ జయప్రద, రామయ్య చారిటీస్, జిల్లా అంధత్వశాఖ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంటి చూపునివ్వాలనే ఉద్దేశంతో తన తల్లి దండ్రుల జ్ఞాపకార్ధం గ్రామానికి చెందిన యార్లగడ్డ అంకమ్మ చౌదరి గత 25 సంవత్సరాల నుంచి గ్రామంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ నేత్రాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 102 మందికి వివిధ రకాల నేత్ర సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారిని శంకర కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో చారిటీస్ చైర్మన్ యార్లగడ్డ అంకమ్మ చౌదరి, డాక్టర్లు రమణ, శ్రీనివాస్, సభ్యులు గన్నవనేని రాఘవరావు, చుండూరి శ్రీనివాస్, కాటూరి శ్రీనివాస్, అంకినీడు, మండవ లక్ష్మీనారాయణ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పిల్లలకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: స్థానిక తురకపాలెంరోడ్డులోని స్వర్ణాంధ్ర నగర్‌లో కేశవ స్మారక సమితి, గుంటూరు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు ఆళ్ల శ్రీకాంత్ రెడ్డి సేవలు అందించారు. చిన్న పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కేశవ స్మారక సమితి కార్యదర్శి చంద్రపాటి సుధాకర్ సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు.

15న శివాలయంలో పౌర్ణమి సహస్ర కలశాభిషేకం



బాపట్ల: కార్తీక పౌర్ణమి 15న బాపట్ల అగ్రహారం శివాలయంలో సహస్ర కలశాభిషేకం జరుగుతుందని అర్చక స్వామి ప్రసాద్ గురుస్వామి తెలిపారు. దేవాలయం నిర్మించి వందేళ్లు అవుతున్నందున.. ప్రతిష్టా మహోత్సవ ప్రారంభ కార్యక్రమం 14న ఉదయం 8 నుంచి అత్యంత వైభవంగా పుర వీధుల్లో శోభయాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్తలు, భక్త బృందాలు, భజన సమాజాలు, కోలాట బృందాలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. శుక్రవారం ఉదయం 7 గంటకు ప్రారంభమయ్యే సహస్ర కలశాభిషేకంలో పాల్గొని స్వయంగా కలశాన్ని అభిషేకం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కొద్ది కలశాలు మాత్రమే ఉన్నందున త్వరితగతిన రుసుము చెల్లించి రసీదు పొందాలన్నారు. మధ్యాహ్నం 12గంటలకు అన్నసంతర్పణ జరుగుతుందని ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గూడూరు చిట్టిబాబు, పంగులూరి కౌండిన్య, అక్కపెద్ది సుబ్రహ్మణ్యం, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ, నెమలికంటి హనుమంతరావు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు


రేపల్లెలో సత్యనారాయణ స్వామికి హారతులు పడుతున్న భక్తులు


పేటేరులో అన్న సంతర్పణలో పాల్గొన్న భక్తులు

రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రాచూరు జమీందారు కోటలో రేపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. శివకేశవులకు ప్రీతిప్రాతమైన కార్తిక మాసం సందర్భంగా కోటలో ఉసిరి చెట్టు నీడన సత్యనారాయణ స్వామిని నెలకొల్పి కూరపాటి నాగ మారుతి శర్మ పూజాది కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు గోధుమ రవ్వతో తయారు చేసిన ప్రసాదాన్ని పంపిణీ చేసి, అన్న సంతర్పణ చేశారు. వన సమారాధనలో పాల్గొన్న మహిళలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కాశేపల్లి ఈశ్వరబాబు, ప్రధాన కార్యదర్శి తడికమళ్ళ బలరామ శ్రీనివాసు (బాలు), ఉపాధ్యక్షుడు పొన్నూరు మల్లికార్జునరావు, ఉప ప్రధాన కార్యదర్శులు యెండూరి శివ రామకృష్ణ, మానేపల్లి వెంకట సాయి మల్లికార్జునరావు, వేముల రామకోటేశ్వరరావు, అదనపు కోశాధికారి గుర్రం సురేష్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు. పేటేరులోని బాబాజీతోటలో అమ్ముల సాంబశివరావు శిష్యబృందం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

'చలపతి'లో ప్రారంభమైన దూర విద్య కేంద్రం

ద్యూయల్ డిగ్రీకి అవకాశం


దూరవిద్యా కోర్సుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: పోస్ట్ గ్రాడ్యుయేట్స్ సైన్స్ విభాగంలో 12 కోర్సులను 2024–25 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించినట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వై.ఆంజనేయులు తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోర్సుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ, చలపతి డిగ్రీ కాలేజి కేంద్రంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం అనుబంధంతో దూరవిద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్స్ సైన్స్ విభాగంలో ఎంఎస్సీ(బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, మ్యాథమెటిక్స్, స్టాటిక్స్టిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, కంప్యూటర్ సైన్స్,సైకాలజి)తో పాటు ఎంబీఏ, ఎంసీఏ కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభించినట్లు చెప్పారు. ఏఎన్‌యూసీడీఈ.ఓఆర్‌జీ/డాష్‌బోర్డ్/అలలిటిక్స్/ వెబ్ సైట్ ద్వారా అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థులు ప్రతి ఆదివారం చలపతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో క్లాసులు జరుగుతాయన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ)2020కు అనుగుణంగా ప్రతి విద్యార్థి ఫార్మసీ, ఇంజినీరింగ్‌తో పాటు అదనంగా ఒకటి లేదా రెండు ద్యూయల్ డిగ్రీ పొందే అవకాశం కల్పించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియాన్ని స్థానిక వాకర్స్, నగరపాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియాన్ని క్రీడల హబ్‌గా, ఉదయం సాయంత్రం వాకింగ్ చేసుకునే వారికి ఆహ్లాదంగా, సమగ్ర మౌళిక వసతుల కేంద్రంగా తీర్చిదిద్దడానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టేబుల్ టెన్నిస్, షటిల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులను, పురుషుల, మహిళల జిమ్‌లను పరిశీలించి, ప్రతి రోజు ఆయా క్రీడలకు ఎంత మంది వస్తున్నారు, స్టేడియం సభ్యుల వివరాలను తెలుసుకున్నారు. మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కొన్ని చోట్ల స్లాబ్ పెచ్చులు ఊడిందని, గోడలు బీటలు వచ్చాయని, వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని చెప్పారు. జిమ్‌లో ఆధునాతన ఎక్విప్మెంట్ ఏర్పాటుకు, బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో లైట్లు, ఏర్పాట్లు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడిబాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

క్రీడల ద్వారా చిన్నారుల్లో మానసిక, శారీరక ధారుడ్యం పెంపొందుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో స్కేటింగ్‌లో శిక్షణ పొందిన శ్రీవల్లి, గౌతమ్ విశ్వాస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా వారిని కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, చిన్నారులను క్రీడలలో ప్రోత్సహించాలన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడల శిక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ క్రీడల కోర్టుల మరమ్మతులు చేపట్టి, నిపుణులైన శిక్షకులతో శిక్షణ అందిస్తామన్నారు.

బొప్పన ఆత్మీయ పురస్కారాలు ప్రదానం

నగరపాలెం: గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి, వైకే నాగేశ్వరరావు కళాపరిషత్ సంయుక్తంగా కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్‌లో నిర్వహిస్తోన్న నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో బొప్పన ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్షులు మైనేని బ్రహ్మస్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి అధ్యక్షత వహించారు. అనంతరం బొప్పన నరసింహారావు ఆత్మీయ పురస్కారాలను ప్రముఖ రంగస్థల నటులు చలసాని కృష్ణప్రసాద్(విశాఖపట్నం), ఎస్ఎం బాషా(నరసరావుపేట), రంగస్థల నటులు దేవిరెడ్డి రామకోటేశ్వరరావులకు అందజేసి సత్కరించారు. అనంతరం మైత్రి కళా నిలయం(విజయవాడ) మాడుగుల రామకృష్ణ రచనలో టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించిన బంధం సాంఘిక నాటిక సందేశాత్మకంగా కొనసాగింది. బత్తినేని సుభాష్ రచన దర్శకత్వంలో ఓరి వీళ్ల నటన పాడుగాను ఆడిషన్స్ స్కిట్ ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో డి.తిరుమలేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, జానీబాషాలు పాల్గొన్నారు.

పిల్లలకంటే ముందు పాములొస్తాయి..



బాపట్ల: మండలంలోని అప్పికట్ల గ్రామంలో లైబ్రరీ సెంటర్ వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల పాత భవనాలు శిధిలావస్థకు చేరుకున్నాయి. ఈ పాఠశాల భవనంతోపాటు పక్కనే ఉన్న మహిళా మండలి భవనం కూడా విష జంతువులకు నివాసంగా మారింది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులు అక్కడ చదువుకోవటంతో పాటు ఆటలు ఆడుకునేందుకు బయటకు వస్తే పాముల భయం వెంటాడుతోంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు కంపచెట్లు తొలగించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ ఆఫీస్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏటుకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో ఆఫీస్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి పనిచేస్తుందని చెప్పారు. పార్టీ కార్యకర్తలపై, సోషల్ మీడియా కార్యకర్తలు, యాక్టివిస్టులపై పెడుతున్న అక్రమ కేసులను దీటుగా ఎదుర్కొని, అన్ని విధాలుగా వారికి అందుబాటులో ఉండేందుకు కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. సెంటర్‌లో మెట్టు వెంకటప్పారెడ్డి (రాష్ట్ర ఉపాధ్యక్షులు, వైఎస్సార్ సీపీ సేవాదళ్) 9849792955, పాటిబండ్ల కవిత గుంటూరు జిల్లా మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి 9390212373, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి (సీనియర్ అడ్వకేట్) 9848361788, ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటారన్నారు.

పేకాట స్థావరంపై దాడి

38 మంది అరెస్టు, రూ.96 వేలు స్వాధీనం

ప్రత్తిపాడు: గుట్టుచప్పుడు కాకుండా రహస్యంగా పేకాటాడుతున్న జూద స్థావరంపై ప్రత్తిపాడు పోలీసులు మెరుపుదాడి చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఓ ప్రైవేటు కళాశాలకు వెళ్లే దారిలో ఉన్న షెడ్డులో పెద్ద ఎత్తున జూదమాడుతున్న సమాచారం ఆదివారం సాయంత్రం ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గన్నవరపు శ్రీనివాసరావుకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలసి స్థావరంపై దాడి చేశారు. 38 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ. 96,300 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ స్టేషన్ సీసీ కెమెరాల డేటా చోరీపై కేసు

లక్ష్మీపురం: నగరంలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల డేటాను చోరీ చేసి ఓ విలేకరికి ఇవ్వడంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఘటనలో స్టేషన్ ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు నగరంలోని పోలీస్ స్టేషన్లు, ఎస్పీ కార్యాలయంలో సీసీ కెమెరాలు, ఇంటర్‌నెట్ కనెక్షన్లు సర్వీస్ అరండల్‌పేటకు చెందిన శేషు అందిస్తుంటాడు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల డేటాను చోరీ చేశాడు. ఆ డేటాలో ఇటీవల బోరుగడ్డ అనిల్ కేసులో రాజమండ్రి నుంచి మూడు రోజుల పోలీస్ కస్టడీకి స్టేషన్‌కు తీసుకొచ్చారు. బోరుగడ్డ అనిల్ పోలీస్ స్టేషన్‌లో బల్లపై దుప్పట్లు వేసుకుని విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కె.శ్రీనివాసరావు అక్కడే ఉండటం, ఉన్న డేటా ఓ పత్రికలో విలేకరిగా పని చేసే వ్యక్తికి శేషు ఇచ్చాడు. సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో రెండు రోజులుగా బోరుగడ్డ అనిల్‌కు రాచమర్యాదలు చేస్తున్న అరండల్‌పేట పోలీసులు అనే కథనాలు వచ్చాయి. రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం రాత్రి అరండల్‌పేట సీఐ శ్రీనివాసరావును వీఆర్‌కు పిలిచారు. డేటా చోరీ చేసిన విషయంపై అరండల్‌పేట ఎస్ఐ రోజాలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల టెక్నీషియన్ శేషు, ఓ దినపత్రికలో విలేకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డే పార్కింగ్ స్థలం


రోడ్డు పక్కన నిలిపిన స్కూల్ బస్సులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు–వెల్లటూరు రహదారిలో ఓ ప్రైవేట్ హైస్కూల్ బస్సులు నిలుపుదల చేయడంతో వాహనదారులు, చోదకులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నిత్యం ఈ రహదారి మార్గంలో వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఈ మార్గంలో రెండు పెట్రోల్ బంకులు కూడా ఉన్నాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోవాలంటే కష్టతరంగా మారింది. దీనికి తోడు మరో పక్క తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఆర్అండ్‌బీ, సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హైందవ సంస్కృతిని పరిరక్షించాలి


మాట్లాడుతున్న హైందవ శంఖారవం రాష్ట్ర కార్యకారణి సభ్యుడు రాజేంద్ర

రేపల్లె రూరల్: హైందవ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు 2025 జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు హాజరుకావాలని హైందవ శంఖారావం రాష్ట్ర కార్యకారణి సభ్యుడు రాజేంద్ర అన్నారు. పట్టణంలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యమత్యంతో హిందువలందరూ దేవాలయాలను పరిరక్షించుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని పలు దేవాలయాలలో రాజకీయ పెద్దల పెత్తనం పెరిగిపోతోందని, దీన్ని నివారించాలని పేర్కొన్నారు. హిందూ సంస్థలకు దేవాలయాలను అప్పగించటంతో పాటు రోజురోజుకు హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలన్న డిమాండ్ల సాధనకై ఈ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభలలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హిందువులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవాహక సభ్యులు వరికూటి శివగోపి, ఆదిశేషు, గూడవల్లి కుటుంబరావు, రాంబాబు, జంజనం హేమశంకరరావు, పేరం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


పూర్వవిద్యార్థులు

బాపట్ల: బాపట్ల పట్టణంలోని మున్సిపల్ హైస్కూలులో 1973–74 సంవత్సరం పదో తరగతి చదవిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో అప్పటి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థి రోహిణి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పాండురంగ విఠల్ పాల్గొని, మాట్లాడారు. పూర్వ విద్యార్థులు చాలా సంవత్సరాలు తర్వాత కలుసుకోవటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, పీఈటీ కత్తి శ్రీనివాసరావు ప్రస్తుత పాఠశాల పరిస్థితిని వివరించారు. అప్పటి గురువు చలమయ్య మాస్టారుని, అటెండర్ చిన్నిబోయిన సుబ్బారావును సన్మానించారు. పూర్వ విద్యార్థులు జూలగంటి ప్రసాద్, తిలక్, పాంచ్ జన్య, తిమ్మరాజు సుబ్బారావు, బి.వేణుగోపాల్, హనుమంతరావు, నాగవరపు నాగేశ్వరరావు, రషీద్, హరి ప్రకాష్, చలమయ్య, రోశయ్య పాల్గొన్నారు.

బీయార్ కథలు పుస్తకావిష్కరణ



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ స్వామి కళావేదికపై ఆదివారం అజో విభో కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంగీత, నృత్య, సాహిత్య, నాటక సంస్థ సంయుక్తంగా ఆచార్య బేతవోలు రామబ్రహ్మం రచించిన బీయార్ కథల పుస్తకావిష్కరణ సభ ఆదివారం జరిగింది. సభకు అజో విభో కందళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోష్యుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు గ్రంథాన్ని ఆవిష్కరించగా, ప్రముఖ నాటక రచయిత వల్లూరి శివప్రసాద్ గ్రంథ పరిచయం చేశారు. సన్రాజు బాలచందర్ రచయిత పుస్తకాన్ని కృతియిచ్చారు. సినీ నటుడు వైఎస్ కృష్ణేశ్వరావు పాల్గొనగా, సాహితీవేత్త ఆచార్య బేతవోలు రామబ్రహ్మంను సత్కరించారు.